## క్లుప్తంగా

### డాక్టరేట్ ప్రదానం



గూడూరు: మండలంలోని రాములుతండాకు చెందిన ధరంసోత్ శ్రీనివాస్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సెంటర్ ఫర్ ఎనర్జీ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామిగుప్తా పర్యవేక్షణలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉపయోగిస్తూ మంచినీటి శుద్ధీకరణ ప్రయోగాన్ని గుర్తించిన జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది.

### వైస్ చైర్మన్‌గా హరికృష్ణ



డోర్నకల్: డోర్నకల్ కాంగ్రెస్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా ఎల్లావుల హరికృష్ణ నియమితులయ్యాడు. బుధవారం హరికృష్ణకు పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి నియామక పత్రం అందజేశాడు.

### 25న మంద కృష్ణ రథయాత్ర

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ చేపట్టిన రథయాత్ర ఈనెల 25వ తేదీన జిల్లాకు చేరుకుంటుందని జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్‌మాదిగ బుధవారం తెలిపాడు. రథయాత్ర విజయవంతం చేయడానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అనిల్‌కుమార్, శంకర్, రేణుక, రజిత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



గూడూరు: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు యువత కృషి చేయాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లాలో బుధవారం రాహుల్‌గాంధీ, ప్రియాంక రాక, బస్సు యాత్ర ప్రారంభానికి గూడూరు మీదుగా వెళ్తున్న పొంగులేటిని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్, యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల నరేష్‌రెడ్డి సన్మానించారు.

### భూమిని స్వాధీనం చేసుకోవాలి

గార్ల: గార్లలోని సమత హైస్కూల్ ఎదురుగా గల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని, ఇట్టి భూమిని ఆక్రమణదారుల నుంచి వెంటనే స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కుమారస్వామికి వార్డు సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఉపసర్పంచ్ కందునూరి మహేశ్వరరావు, వార్డు సభ్యులు శ్రీను, విజయలక్ష్మి ఉన్నారు.

### అధ్యక్షుడిగా వీరునాయక్



నెల్లికుదురు: మండలంలోని జామతండా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా గుగులోతు వీరునాయక్‌ను తండావాసుల సమక్షంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ తెలిపారు.

### అడుగడుగునా తనిఖీలు



డోర్నకల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డోర్నకల్ శివారు అమ్మపాలెం క్రాస్‌రోడ్డు, ముల్కలపల్లి శివారు పెట్రోల్ బంక్ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కంటెయినర్లు, కార్లు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కలెక్టర్‌తో సహా జిల్లాస్థాయి అధికారులు చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్నారు.

### ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

మరిపెడ రూరల్: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలైన సంఘటన మండలంలోని తాళ్లఊకల్ ప్రధాన రహదారిలో పాంబండ తండా సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తాళ్లఊకల్ గ్రామానికి చెందిన ఆకుల శ్రీను(45) ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వెళ్లి కిరాణ సరుకులతో తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో పాంబండతండాకు చెందిన గుగులోతు దాసు అనే వ్యక్తి ఓ పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాళ్లఊకల్ ప్రధాన రహదారిలోని పాంబండతండా సమీపంలోని మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘనటలో ఆకుల శ్రీను మృతి చెందగా, మరో వ్యక్తి దాసుకు గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# అట్ల బతుకమ్మ సంబురాలు

ఐదోరోజు అట్ల బతుకమ్మ సంబురాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలనుపాడుతూ, నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాల నడుమ బతుకమ్మలను ఆలయ ప్రాంగణంలో నిమజ్జనం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



నెల్లికుదురు: బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు



గార్ల: వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో..



తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..



మానుకోట: వేణుగోపాలస్వామి ఆలయంలో..



మహబూబాబాద్ రూరల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మరిపెడలో..

# బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆశీర్వదించాలి



మాట్లాడుతున్న బానోత్ తేజస్విని

మహబూబాబాద్ రూరల్: సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ కుమార్తె తేజస్విని కోరారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో బుధవారం పార్టీ కమిటీల నియామకం, ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా తేజస్విని మాట్లాడుతూ.. మహబూబాబాద్ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ సహకారంతో అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంద వీరన్న, పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లూనావత్ అశోక్, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ వెంకన్న, మండల కోఆప్షన్ సభ్యుడు షరీఫ్, ఏఎంసీ డైరెక్టర్ ధరావత్ బాలు పాల్గొన్నారు.

# జీఓ 59తో పేదలకు ఆర్థిక ఇబ్బందులు



కౌన్సిలర్‌తో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు నిర్మించుకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం 59 జీఓ తీసుకొచ్చి పేదలను ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాతోతు హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డులోని బీజేపీ ఇంటింటికి హుస్సేన్ నాయక్ ప్రజా ఆశీర్వాద యాత్రను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే సీఎం కేసీఆర్ దళితులు, బీసీలు, గిరిజనులు గుర్తుకు వస్తారని, 2018లో ముందస్తు ఎన్నికల్లో నిరుద్యోగులకు భృతి ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మానుకోట ప్రజలు అవకాశం కల్పించి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఎర్రం రెడ్డి సిద్ధార్థరెడ్డి, నాయకులు పల్లె సందీప్, ప్రేమ్ రాయుడు, చీకటి కిరణ్, నవీన్‌నాయుడు, వెన్నమల్ల సందీప్, ఓర్సు పద్మ పాల్గొన్నారు.

## ‘గ్యారంటీ’లతో పేదల జీవితాల్లో వెలుగులు



ప్రచారం చేస్తున్న నాయకులు

కురవి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని కాంగ్రెస్ మండల కార్యదర్శి అవిరె మోహన్‌రావు, మండల ఉపాధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు గణేష్, లక్ష్మయ్య, ఆనందం, విశ్వనాథం, వీరభద్రం పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం



చిన్నగూడూరు: ఎమ్మెల్యేను కలిసిన నాయకులు, ప్రజాప్రతినిధులు

చిన్నగూడూరు/డోర్నకల్: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం అని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. సీఎం కేసీఆర్ నుంచి బీఫాం అందుకున్న ఎమ్మెల్యేను బుధవారం ఉగ్గంపల్లిలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో డోర్నకల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపామన్నారు. ఇంటింటికి తాగునీరు, ప్రతీ పల్లెకు పక్కా రోడ్లు ఇచ్చామని ఓటు అడిగే హక్కు తమకే ఉందన్నారు. ఓట్ల కోసం మాయమాటలు చెప్పే వారిని నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, నాయకులు రవీందర్, రాంబాబు, అశోక్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, నాయకులు రామనాథం, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

**ఆత్మీయ పలకరింపు**

కురవి: మండల కేంద్రంలో పలువురిని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బుధవారం ఆత్మీయ పలకరింపు చేశారు. మండల కేంద్రంలో ఆలయ మాజీ చైర్మన్ మేక దామోదర్‌రెడ్డి, సీపీఐ సీనియర్ నాయకుడు నూతక్కి వెంకటేశ్వరరావుల ఇంటికి వెళ్లి ముచ్చటించారు. ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరాడు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బజ్జూరి పిచ్చిరెడ్డి, వార్డు సభ్యులు నూతక్కి నర్సింహరావు, మల్లికార్జున్, వెంకన్న, రాజునాయక్ పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం రూ.1,74,598

గార్ల: మర్రిగూడెం వేట వేంటేశ్వరస్వామి దేవాలయం హుండీ ఆదాయంను లెక్కించగా రూ.1,74,598 వచ్చినట్లు జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత బుధవారం వెల్లడించారు. ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్, ధర్మకర్తలు నరేందర్, రాణి పాల్గొన్నారు.

# అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ తిరుపతిరెడ్డి

మహబూబాబాద్ రూరల్: ఎరువులు, పురుగుల మందులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఏఓ తిరుపతిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో డీలర్ల వద్ద ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించి రైతులకు ఎంఆర్పీ ధరకంటే ఎక్కువకు అమ్మవద్దని సూచించాడు. అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించాడు. ఎరువులతో పాటు ఏ ఇతర మందులను లింకుపెట్టి అమ్మినా సరే వ్యవసాయ అధికారికి తెలియజేయాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ ద్వారా యూరియాను కొనుగోలు చేసి రైతులకు ఎంఆర్పీ ధరకంటే తక్కువకు ఇస్తున్నామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# డిజిటల్ చెల్లింపులపై అవగాహన



కేసముద్రం: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కేసముద్రం: విద్యుత్ వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించాలని మహబూబాబాద్ విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్ అన్నారు. బుధవారం కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా బిల్లులను చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏస్ఏఓ సంతోష్‌కుమార్, ఏడీఈ శ్రీనివాసులు, ఇనుగుర్తి ఏఈ శశిధర్, కేసముద్రం ఏఈ రాజు, సీహెచ్ శ్రీనివాస్, యశ్వంత్, అంబేడ్కర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో పెద్దముప్పారం, బొడ్లాడ, మండల కేంద్రంలో బుధవారం ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులపై టెక్నికల్ డీఈ సునీతదేవి వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ పాపిరెడ్డి, ఏఈఎస్ జహురు పాషా, భాగ్యలక్ష్మి, ఉమారాణి పాల్గొన్నారు.

చిన్నగూడూరు: డిజిటల్ చెల్లింపులతో వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని చిన్నగూడూరు అసిస్టెంట్ ఇంజినీరింగ్ నవ్య, సబ్ ఇంజినీరింగ్ నిహార్ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ బిల్లుల డిజిటల్ చెల్లింపులపై ప్రచారం నిర్వహించారు.

# గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

కురవి: గుడుంబా స్థావరాలపై కురవి, సీరోలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం దాడులు నిర్వహించారు. కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేరడ శివారు కాకులబోడు తండా జీపీలో దాడులు నిర్వహించి 1000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 150కేజీల బెల్లం, 30లీటర్ల గుడుంబాను సీజ్ చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గోపి తెలిపారు. అలాగే సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేకుల తండా జీపీలో ఎక్సైజ్‌శాఖ అధికారులతో కలసి గుడుంబా స్థావరాలపై దాడులు చేసినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు. 12వందల లీటర్ల నల్లబెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 30 కేజీల బెల్లం, 70 లీటర్ల గుడుంబాను సీజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

**కల్వల గ్రామంలో..**

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో బెల్టు షాపులపై, రంగాపురం గ్రామంలో గుడుంబా స్థావరాలపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం ..రంగాపురంలో 400లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోగా, కల్వలలో రూ.10వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు మహిళలపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# కొనసాగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు



మహబూబాబాద్ రూరల్: కరెన్సీ నోట్లతో దుర్గామాతకు అలంకరణ



మరిపెడ రూరల్: రాంపురంలో శాకాంబరి అలంకరణలో..



కేసముద్రం: శాకాంబరి అలంకరణలో దుర్గాదేవి



డోర్నకల్: ఉయ్యాలవాడలో పూజలో పాల్గొన్న నున్నా రమణ, ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ విగ్రహం వద్ద బుధవారం భక్తులు పూజలు నిర్వహించారు. నాల్గో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా, తదితరులు



గార్ల: పూజలో పాల్గొన్న భక్తులు



కురవి: దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



గూడూరు: సాయిబాబా ఆలయంలో..

### విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: ఈనెల 21వ తేదీన జరుగనున్న అఖిల భారత యువజన సంఘం (ఏఐవైఎఫ్) జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు వీరవెల్లి రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మహాసభల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వీరవెల్లి రవి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో, కరోనా కష్టకాలంలో ఏఐవైఎఫ్ పాత్ర మరువలేనిదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని 2018లో ఓట్లు దండుకున్న కేసీఆర్ యువతను మోసం చేశారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీకి ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో తోట రమేష్, మెతుకు కుమార్, నూనావత్ బాలు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

డోర్నకల్: ఇటీవల డోర్నకల్‌లో నిర్వహించిన ఐదు జిల్లాల స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీలతోపాటు మహబూబాబాద్‌లో జరిగిన అండర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక నిర్మలా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బెంచ్‌ప్రెస్ పోటీలలో 7వ తరగతి విద్యార్థిని ఎస్.శ్రావ్య 30 కేజీల విభాగంలో మొదటి స్థానంలో, బి.తరణి 25 కేజీల విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. మహబూబాబాద్‌లో జరిగిన అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన కె.ప్రణయ్ 800 విభాగంలో ప్రథమ, 1500మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించగా, బి.శర్మిలారాథోడ్ 400 మీటర్ల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరస్పాండెంట్ సిస్టర్ లీనా, హెచ్‌ఎం సిస్టర్ థెరిసా, పీఈటీ మండలోజు సుధాకర్, ఉపేందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## 30క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



దంతాలపల్లి: 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని మోటారు సైకిల్ సీజ్ చేసిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గల కనకదుర్గ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం దిగుమతి చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్సై రమేష్‌బాబు సిబ్బందితో మిల్లుకు చేరుకున్నాడు. మిల్లుకు బియ్యం తరలిస్తున్న సూర్యాపేట్ జిల్లా కొదాడ పట్టణానికి చెందిన పుట్టబంతి తిరుపతి, శాలిగౌరారం గ్రామానికి చెందిన కోతూరు పరమేష్, రాయరాపు కాటమరాజులను పట్టుకున్నారు. వారిని విచారించగా మిల్లు యజమాని నాగేశ్వరరావు చెప్పడంతో బియ్యం తీసుకు వచ్చామని తెలిపారు. తిరుపతి, పరమేష్, కాటమరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. తనిఖీలో ఏఎస్సై జన్నయ్య, సిబ్బంది బగ్గు, భాస్కర్ పాల్గొన్నారు.

## బోనస్ అవకతవకలపై విచారణ



బయ్యారం: మండలంలోని బాలాజీపేటలో తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ డబ్బుల్లో జరిగిన అవకతవకలపై బుధవారం అటవీశాఖ విజిలెన్స్ డీఎఫ్ఓ రాజశేఖర్ విచారణ నిర్వహించారు. 2016 నుంచి 2020 వరకు తునికాకు సేకరించిన కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బోనస్ విడుదల చేసింది. ఈ బోనస్ డబ్బులు అర్హులకు కాకుండా అనర్హులకు అందాయని కూలీలతో పాటు పలు పార్టీల నాయకులు అటవీశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అవకతవకలపై విచారణ జరుపుతున్నట్లు విచారణాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు.